


# నవభూమి

## నల్లగొండ అనుబంధం

10 సెప్టెంబర్,2024 మంగళవారం పేజిలు:5

www.epaper.navabhoomi.in


# ఒకే బోనం.. ఒకే గణపతి



**మాడ్గులపల్లి:-నవభూమి:** ఉమ్మడి కుటుంబంలో ఒకరినొకరికి పడని ప్రస్తుత సమాజంలో ఒక గ్రామమంతా ఐక్యంగా ఉంటోంది. గ్రామంలో ఏ పనిచేపట్టాలన్నా కులమతాలకు, వర్గాలకతీతంగా ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకెళ్తున్నారు నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం కేశవాపురం గ్రామస్థులు. గ్రామంలో 109 కుటుంబాలు సుమారు 509 జనాభా ఉన్నారు. పురాతన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తూ గ్రామంలోని ప్రజలందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ పనులు చేసుకుంటున్నారు. గ్రామంలో ఎక్కడా ఏ గొడవలు లేకుండా తామంతా ఒక్కటేననే నినాదంతో ముందుకు సాగుతున్నారు. ఈ గ్రామం గతంలో ఉమ్మడి కన్నెకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన మండలాల ఏర్పాటులో కేశవాపురం మాడ్గులపల్లి మండల పరిధిలోకి వచ్చింది. గతంలో నిడమనూరు మండలంలోని కన్నెకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉండే కేశవాపురం నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. కేశవాపురం ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటైనా గతంలో ఉన్న ఆనవాయితీని కొనసాగిస్తుంది. ఊరువారంతా ఆలయ నిర్మాణానికి దాతలే కేశవాపురం గ్రామంలో గతంలో చిన్న రామాలయం ఉం డేది. రామాలయం నిర్మించుకునేందుకు గ్రామస్థులందరూ ఒకచోట కూర్చొని ఇతరులపై ఆధారపడకుండా తలా కొంత నగదును పోగుచేసి రూ.38లక్షలు జమ చేసి 2021 సంవత్సరంలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి కేవలం 8నెలల్లోనే రామాలయాన్ని పూర్తిచేసి ప్రారంభించారు. ఆలయానికి ఒక్కొక్కరు ఇచ్చిన విరాళాన్ని ఊరు వారంతా దాత లే అని బోర్డు పెట్టి తామంతా ఒక్కటేననే భావనను కలిగించారు.శ్రీరామనవమి, వినాయకచవితి, పీర్ల పండుగను కులమతాలకు అతీతంగా ఊరి ప్రజలంతా కలిసిమెలసి నిర్వహిస్తారు. అదేవిధంగా గ్రామంలో ముస్లింలు తక్కువగా ఉన్నా వారు అందరితోనూ కలిసి భజన, కోలాటంలో పాల్గొని మత సామరస్యాన్ని చాటుకుంటారు.గ్రామంలో ఒకే బోనం - ఒకే గణపతి శ్రావణమాసంలో వచ్చే పండుగల్లో బోనాల పండుగ ఒక టి. గ్రామాల్లో గ్రామ దేవతలకు పూజించాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ప్రతి ఇంట్లో బోనం చేసే ఈ రోజుల్లో కేశవాపురం గ్రామంలో మాత్రం ఊరికి ఒకే బోనాన్ని గ్రామ దేవతకు సమర్పిస్తుంటారు.గ్రామంలోని ఇంటింటికీ బియ్యం, నూనె,పసుపు, అగరబత్తీలను సేకరించి గ్రామంలోని సత్తె మ్మ అనే మహిళ ఇంట్లో బోనం ఏర్పాటు చేస్తారు. అనంత రం ఆమె బోనం ఎత్తుకోగా గ్రామస్థులందరూ డప్పు చప్పుళ్ల తో ముత్యాలమ్మకు బోనం సమర్పిస్తారు. అదేవిధంగా వినాయక చవితి పండగ వచ్చిందంటే గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. చందాలు వసూలుచేసి వీధికో విగ్రహాన్ని పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుంటారు. కానీ తామంతా ఒక్కటే అనే భావంతో కలిసి గ్రామంలో ప్రధాన కూడలిలో ఒకేచోట ఒకే గణపతి విగ్రహాన్ని ఏర్పాటుచేస్తారు. గణేష్ నవరాత్రుల పూజలు నిర్వహిస్తూ పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో 40ఏళ్లకు పైగా రామాల యం వద్ద గణపతి విగ్రహాన్ని పెట్టి నవరాత్రి పూజలు చేస్తున్నారు. గ్రామంలోని అన్ని కులాల పెద్ద మనుషులు పది రోజుల ముందే కమిటీని ఏర్పాటు చేసుకొని వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామంలో వినాయకుని ఉత్సవాల కు గ్రామస్థులంతా కలిసి తమ పనులు పూర్తిచేసుకుని రాత్రి 11 గంటలవరకు ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఎలాంటి డీజే సంబంధిత పాటలు లేకుండా సంప్రదాయ పాటలు, భజన, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తూ వారి భక్తిని చాటుకుంటున్నారు. గణేష్ నవరాత్రుల నిమజ్జనం కూడా ఎక్కడో సుదూర ప్రాంతాలకు వెళ్లి నిమజ్జనాలు చేయకుండా గ్రామానికి సమీపంలో ఉండే గం గన్నపాలెం గ్రామ చెరువులో స్వామి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తూ ప్రత్యేకత చాటుతున్నారు. అదేవిధంగా కార్తీకమాసంలో మాలధారణ స్వాములకు అన్నదానం నిర్వహిస్తుంటారు. కన్నెకల్ ఉమ్మడి గ్రామపంచాయతీలో ఉన్నప్పటి నుంచి అదే విధానం కొనసాగగా నూతన గ్రామ పంచాయ తీ ఏర్పాటైన తర్వాత కూడా ఐక్యతగా ఉంటూ ఒకే గ్రామం, ఒకే గణపతి విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఈ విషయం తెలిసిన పలు గ్రామాల ప్రజలు కేశవాపురం గ్రామస్థులను ఆదర్శంగా తీసుకోవాలంటూ చర్చించుకుంటున్నారు.పలు గ్రామాల్లో పరిస్థితి ఇలా ..మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు విగ్రహాలను నిర్వాహకులకు అందజేస్తున్నారు. ఒకరినిమించి ఒకరు గ్రామాల్లో కొత్త తర హా విధానాలను అనుసరిస్తున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా డీజే సౌండ్‌లు, రాజకీయ పార్టీలకు పార్టీలకు సంబంధించిన పాటలను పెడుతూ దేవుడి మండపాల వద్ద రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీంతో ప్రశాంతంగా పూజలు నిర్వహించుకోవాల్సిన భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి భిన్నంగా గ్రామంలోని ఒకే విగ్రహాన్ని నెలకొల్పి గ్రామస్థులంతా భజన, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ మేమంతా ఒక్కటే అనే కోణంలో ముందుకు వెళ్తున్న కేశవాపురం గ్రామం పలువురికి నిదర్శంగా నిలుస్తోంది.ఉత్సవాల సమయంలో భజన, కోలాట కార్యక్రమాలు వినాయక చవితి, దుర్గాష్టమి వివిధ ఉత్సవాల సమయంలో రాత్రయిందంటే చాలు గ్రామస్థులందరూ తమ పనులను ముగించుకొని రామాలయం వద్దకు చేరుకుంటారు. చిన్నాపెద్దా, ఆడమగా అనే తేడా లేకుండా భజన, కోలాట కార్యక్రమాల్లో పాల్గొని సందడి చేస్తారు. పురాతన కాలం నుంచి కోలాటం, భజనలు చేయడం ద్వారా గ్రామీణ కళలను భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్నామని గ్రామస్థులు పేర్కొంటున్నారు.గ్రామస్థులంతా కలిసిమెలసి ఉంటాం : దుర్గి శ్రీనివాస శర్మ, గ్రామ పురోహితుడు, కేశవాపురం మా గ్రామంలోని ప్రజలందరం ఒకే మాట మీద నిలబడి కలిసిమెలసి ఉంటాం. పండుగలను కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ. కేశవాపురంలో 42 సంవత్సరాలుగా గ్రామస్థుల సహకారంతో గ్రామ పురోహితుడిగా ఉన్నాను.

# రుణమాఫీపై స్పష్టత లేని ప్రభుత్వం

**సూర్యాపేట-నవభూమి:** రైతులకు రూ.2లక్షల రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రోజుకో మాట కాకుండా స్పష్టమైన వైఖరి వెల్లడించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీషరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒకలా, మంత్రులు మరోలా మాట్లాడుతున్నారని, దీంతో రైతులు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. పరిపాలనపై సీఎం, మంత్రులకు అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రైతు రుణమాఫీపై తొలుత రూ.40వేల కోట్లని, ఆ తరువాత రూ.31వేల కోట్లని చెప్పి బడ్జెట్‌లో మాత్రం రూ.26వేల కోట్లు కేటాయించి, ఇప్పటి వరకు రూ.18వేల కోట్లు విడుదల చేశామని చెబుతున్నారని అన్నారు. రుణమాఫీకి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.10వేల కోట్లు కూడా విడుదల చేయలేదన్నారు. బ్యాంకుల నుంచి సమాచారం తీసుకున్న ప్రభుత్వం మాఫీ రాని రైతులు వ్యవసాయశాఖాధికారులు, బ్యాంకర్లు, కలెక్టర్‌ను కలవాలని తప్పుడు సమాచారం ఇస్తూ మోసం చేస్తోందన్నారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చి మళ్లీ మోసం చేయాలనుకోవడం చూస్తుంటే ఇంతకంటే దుర్మార్గమైన ప్రభుత్వం ఇంకోటి ఉండదన్నారు. విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి ఏవిధంగా ఉందో ఇప్పుడు అదే పరిస్థితి ఉందన్నారు. సీఎం నుంచి మంత్రుల వరకు వ్యక్తిగత సంపాదనపై దృష్టి సారించారని, ప్రజలకు సేవలందించాలనే ఆలోచనే వారికి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం రూ.2లక్షల వరకు రుణమాఫీ డబ్బు బ్యాంకులో జమ చేయాలని, ఆపైన రుణం పొందిన రైతులు ఎవరైనా ఉంటే వాటిని చెల్లిస్తారని అన్నారు. వానాకాలం పంటలు చేతికొచ్చే సమయం సమీపిస్తోందని, ఇప్పటికైనా రైతు భరోసా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే వరద నష్టం ఎక్కువగా వాటిల్లిందన్నారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి-కొత్తగూడెం, ములుగు, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వెంటనే పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ఖమ్మంలో వరద బాధితులను ప్రతిపక్ష పార్టీ నాయకులు పరామర్శించేకు వెళ్తే దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఖమ్మంలోని వరద బాధితుల నివాసాల్లో గంట సమయం ఉండే దమ్ము మంత్రులకు ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నాయకులు వై.వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాసగౌడ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, ఆకుల లవకుశ, తాహేర్‌పాష, దొంగరి యుగంధర్, జానీ యాదవ్, అనిల్‌రెడ్డి, జానకిరాములు, తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో భద్రతా చర్యలు పటిష్ఠంగా నిర్వహించాలి

### ఎమ్మెల్యే బిఎల్ఆర్






**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:–** మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరారు. సోమవారం ప్లాంటులో అధికారులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పవర్ ప్లాంట్ లో చోరీ జరగడం ఇది రెండవ సారి భద్రత కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. దీనికి కారణమైన ప్రతిఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు బలంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఇది ప్రభుత్వం ఖజానా అంటే ప్రజలది ప్రజల ధనాన్ని దోచుకోకుండా కాపాడాల్సిన బాధ్యత అధికారులది అంటే మనదేనన్నారు. గత పాలనలో జరిగిన పొరపాట్లను జరగకుండా. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని అన్నారు. మరో సారి ఇలాంటి ఘటనలు జరిగితే ప్రతి ఒక్కరిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో పవర్ ప్లాంట్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇతర ఉన్నత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చింత మల్ల వీరయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన తూముల సురేష్ రావు

**పెన్‌పహాడ్‌ప్రతినిధి సెప్టెంబర్ 9(నవభూమి)** మండల పరిధిలోని ధూపహాడ్ గ్రామంలో చింతమల్ల వీరయ్య అనారోగ్యంతో మరణించడంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూముల సురేష్ రావు గారు వారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మల్లెపల్లి కరుణాకర్ పెద పోలు వెంకటేశ్వర్లు గోపగాని లక్ష్మీనారాయణ దొంగరి సోమేశ్వరరావు గోపగాని శ్రీను మేకల మధు నిమ్మల కనకయ్య మాతంగి ప్రవీణ్ కీత రామకృష్ణ గుగ్గిళ్ళ శ్యాం సన్ తదితరులు పాల్గొన్నారు



### ప్రభుత్వ కార్యాయాలలో

# ప్రజాకవి కాళోజీ జయంతి

◆ కాళోజీకి నివాళులర్పించిన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్






**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:–** ప్రజాకవి, పద్మవిభూషణ్, తెలంగాణ ఉద్యమకర్త కాళోజీ నారాయణరావు తెలంగాణ భాషకు చేసిన సేవలు మరచి పోలేనివని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటి అన్నారు. సోమవారం కాళోజీ నారాయణరావు వర్ధంతి, తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన కవిత్వంతో సమకాలిన ప్రజా సమస్యలపై జీవితాంతం కలమెత్తిన మహనీయుడాన్నారు. తెలంగాణ భాషకు, సాహిత్యానికి ఆయన చేసిన సేవలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హాజిషరీఫ్, సీసీ కోడిరెక్క సంపత్ కుమార్, జెఏ జమాల్ పాల్గొన్నారు. అదేవిధంగా తహసిల్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్.హరిబాబు, డిప్యూటీ తహశీల్దార్ కల్పన, ఎఆర్ఐ టీ. రామకృష్ణ సత్యనారాయణలు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ప్రజాకవి కాళోజి జయంతి సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యం.శేషగిరి శర్మ, మండల పంచాయతీ అధికారి మాతంగి రమేష్, మండల విద్యాధికారి బాలాజీనాయక్ వ్యవసాయ అధికారి సైదానాయక్, ఏఈ విద్యుత్ శాఖ, హార్టికల్చర్ ఆఫీసర్, ఉపాధి హామీ పథకం ఏపీఓ కళావతి, ఏపిఎం కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# వైటీపీఎస్‌లో వరుస చోరీలు

**దామరచర్ల, –నవభూమి:** యాదాద్రి థర్మల్ విద్యుత్తు ప్లాంటులో వరుస చోరీలు జరుగుతున్నాయి. ప్లాంటు పనులు ప్రారంభమైన ఏడేళ్ల కాలంలో సుమారు రూ.వంద కోట్ల విలువైన ఇనుము చోరీకి గురైనట్లు తెలుస్తోంది.పట్టుబడిన సందర్భాలలో పోలీసులు నామమాత్రపు కేసులు నమోదు చేస్తుండటంతో దొంగతనాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తాజాగా శనివారం సాయంత్రం ఇనుము సామగ్రితో వాహనం పవర్‌ప్లాంటు నుంచి రాగా.. విశ్వసనీయ సమాచారం మేరకు వాడపల్లి పోలీసులు పట్టుకున్నారు. విచారించగా ఇనుము కొనుగోలుదారు, దందాకు పాల్పడే వారి వివరాలు బహిర్గతమైనట్లు తెలుస్తోంది. సాత్‌తండా, దుబ్బతండాకు చెందిన ముగ్గురు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. వీరి ద్వారా ప్లాంటులో పనిచేసే వివిధ సంస్థల ఇంజినీర్లు, ఉద్యోగులు పాత ఇనుమును వాహనాలలో తరలిస్తున్నారు. ఇందుకు భారీగా నగదు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. రెండు నెలల క్రితం ఇనుము చోరీ చేసే ముఠా పోలీసులకు పట్టుబడింది. వీరి వెనుక మిర్యాలగూడ పట్టణానికి చెందిన కొందరు వ్యాపారులు ఉన్నారని తెలుస్తోంది. కొద్ది రోజుల వ్యవధిలోనే చోరీలు పునరావృతం కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.సీపీఎఫ్ ఆధీనంలో ఉన్నా..వైటీపీఎస్ ప్లాంటు పనులు 2017లో ప్రారంభం కాగా.. 2022 వరకు ప్లాంటు భద్రతను సివిల్ పోలీసులు చూసేవారు. ఏడాదిన్నర క్రితం ప్లాంటు రక్షణను సీపీఎఫ్(ప్రత్యేక రక్షణ బృందం)కు అప్పగించారు. ఒక డీఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు 70 మంది సీపీఎఫ్ సాయుధ బలగాలు నిరంతరం కాపలాగా ఉంటున్నారు. అంతేగాక ప్లాంటు చుట్టూ వాచ్‌టవర్లు, సీసీకెమెరాల పర్యవేక్షణ ఉన్నప్పటికీ చోరీలు ఆగకపోవడం గమనార్హం.ఎక్కడ చూసినా సామగ్రి..నిర్మాణానికి అవసరమయ్యే ఇనుము, అల్యూమినియం, కాపర్ సామగ్రిని ప్లాంటు లోపల, వెలుపల ఇష్టానుసారంగా నిల్వ ఉంచారు. ప్లాంటు నిర్మాణ బాధ్యతను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించామని, సామగ్రి రక్షణ బాధ్యత తమకు లేదని ప్లాంటు సీఈ సమ్మయ్య ఇటీవల వెల్లడించడం విశేషం. రూ.కోట్ల విలువైన ఇనుము సామగ్రిని ఇష్టానుసారంగా వదిలేయడంతో చోరీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత సామగ్రి తుప్పు పట్టినట్లు తెలుస్తోంది. టీవీగూడెం వైపు నిల్వ ఉన్న సామగ్రి చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో చోరీలు సులువుగా జరుగుతున్నాయి.



## అప్పుల బాధకు ఆటో డ్రైవర్ ఆత్మహత్య

### మృతుడు రావుల నాగేష్





**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 09** అప్పుల బాధ తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన పురపాలక కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పురపాలక కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన రావుల నాగేష్ 34 టాటా ఏసీ డ్రైవర్గా జీవనం కొనసాగిస్తున్నాడు . ఇతనికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ అప్పులు ఎక్కువైన నేపథ్యంలో సోమవారం ఉదయం ఆటోలో ఇంటి నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటల జలాల్పూర్ శివారులోని ఫారెస్ట్ ఏరియా లో భార్య ధనలక్ష్మి కి ఫోన్లో వీడియో కాల్ చేసి నేను చనిపోతున్నాను అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. వెంటనే భార్య సమీప బంధువులకు ఫోన్ చేసి ఇలా చెప్పాడని అక్కడికి వెళ్లి వెతుకుమని చెప్పారు. అక్కడికి వెళ్లి వెతికి చూడగా ఆటో నిలబెట్టిన ప్రాంతంలో నుండి ఫారెస్ట్ ఏరియాలో వెతకగా ఒక చెట్టుకు అప్పటికే ఉరివేసుకొని వేలాడుతూ ఉన్నాడు. కాగా కొనఊపిరితో ఉన్నాడని ఉరినివిడిపించి ఆసుపత్రికి తరలిద్దామని అప్పటికి నాగేష్ మృతి చెంది ఉన్నాడు వెంటనే బంధువులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై భాస్కర్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ధనలక్ష్మికి నాగేష్ ది ప్రేమ వివాహం రావడంతో భార్య మృతదేహం పడి కన్నీరు నేరుగా విలపిస్తున్న తీరని చూసి చూసే వారంతా శోక సముద్రంలో మునిగిపోయారు.


## హావభావాలు, వాయిస్ మాడుల్స్‌తో పిల్లలతో చదివింపు

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:–**పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ ఆర్.మమత ఆధ్వర్యంలో చిల్లాపురం సెక్టార్ పరిధిలోని కురియా తండా అంగన్వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా, షెడ్యూల్ ప్రకారం పిల్లలకు కథల పుస్తకాలను ఇచ్చి, కథల పుస్తకాలను బిగ్గరగా చదివించారు. కథనానికి అనుగుణంగా హావభావాలతో, వాయిస్ మాడ్యూలేషన్ లతో సూపర్వైజర్ ఆర్.వాని, టీచర్ నీలావతి బిగ్గరగా కథలు చదివించి పిల్లలకు వినిపించారు. అదేవిదంగా కిషోర బాలికలకు రక్తహీనత గురించి అవగాహన కలిగించి, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నీలావతి, హెల్పర్ హచ్చి లబ్ధిదారులు పాల్గొన్నారు.




# ఉపాధి ఉత్సవం

**మిర్యాలగూడ –నవభూమి:** వినాయక చవితిని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్ని పట్టణ, గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ఖర్చుకు వెనకాడకుండా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.దీనికి విగ్రహం ఎంపిక నుంచి మండపాల ఏర్పాటు, అలంకరణ వంటి వాటిలో రాజీపడకుండా ఏర్పాట్లు చేసుకున్నారు. దీంతో వేలాది మందికి ఉపాధి దొరుకుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది సుమారు 3,500 పైగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది రూ.5 వేలకు పైగా మండపాలు వెలిశాయి. దీంతో గణపతి నవరాత్రి ఉత్సవాల పేరిట సుమారు రూ.80 కోట్ల పైగా వ్యాపారం జరుగుతుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.పెరిగిన మండపాలు..ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, సూర్యాపేట, మిర్యాలగూడ వంటి పట్టణాల్లో గతంలో 250 నుంచి 350 విగ్రహాలను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం 450 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. దీంతో విగ్రహాల తయారీ దారులకు గిరాకీ పెరిగింది. వీధులు, దేవాలయాలతో పాటు అపార్ట్‌మెంట్లలో సైతం గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.స్థాయిని బట్టి చిన్న, మధ్యస్థ, పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. పరిమాణాన్ని బట్టి రూ.8 వేల నుంచి రూ.2 లక్షల వరకు విగ్రహానికి ఖర్చు చేస్తున్నారు. విగ్రహం ఖరీదు కంటే ఇతర ఖర్చులు రెట్టింపవుతున్నాయని ఉత్సవాల నిర్వాహకులు చెబుతున్నారు.వేదిక నుంచి అలంకరణ, విద్యుద్దీపాలు, బ్యాండ్, ప్రసాదాల తయారీ ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. వేదిక ఏర్పాటుకు సెంట్రింగ్ పని వారు, పాక ఏర్పాటుకు మేదరి వారు, టెంట్‌హౌజ్, పూల దుకాణాలు, కిరాణ దుకాణాలు, కూరగాయల వ్యాపారులు, వంట పనివారు, అయ్య వార్లు, డెకరేషన్, లైటింగ్, మిఠాయి దుకాణాలు, కళాకారులు, బ్యాండ్ మేళం, టపాసుల దుకాణాలు వంటి పలు రంగాల వారికి ఉపాధి లభిస్తోంది.అయ్యవార్లకు గిరాకీ..గణపతి పూజలకు అయ్యవార్లు కచ్చితంగా ఉండాల్సిందే. ఏటా మండపాల సంఖ్య పెరగడంతో అయ్యవార్ల కొరత ఏర్పడుతోంది. ఒక్కరే అయ్యవారు నాలుగైదు మండపాల్లో ఉత్సవాలు నిర్వహించాల్సి వస్తోంది. దీంతో పలు మండపాల్లో సాయంత్రం 5 గంటలకు సైతం పూజలు మొదలు కాని పరిస్థితి నెలకొంది. ఇక మరో వైపు నవరాత్రి ఉత్సవాల్లో ప్రధానంగా కనిపించేది అన్నదానాలు. అన్నదానాల్లో వంట వారి పాత్ర కీలకం. అనేక మండపాల్లో ఒకే రోజు అన్నదానాలు ఏర్పాటు చేస్తుండడంతో వంట వారికి కొరత ఏర్పడుతుంది.గణపతి నవరాత్రి ఉత్సవాలకు అయ్యే ఖర్చుల వివరాలు..విగ్రహం చిన్న నుంచి పెద్దవి: రూ.8 వేల నుంచి రూ.2లక్షలు మండపం (అలంకరణను బట్టి): 10 వేల నుంచి రూ.2లక్షలు వేదిక: రూ.8 వేల నుంచి రూ.30వేలు పూజా సామగ్రి (మూడు నుంచి 10 రోజులకు): రూ.6వేల నుంచి రూ.30వేలు అన్నదానం, ప్రసాదాలు: రూ.30 వేల నుంచి రూ.2లక్షలు సాంస్కృతిక కార్యక్రమాలు: రూ.10 వేల నుంచి రూ.2లక్షలు వేదిక పరిసరాల అలంకరణ, విద్యుద్దీపాలు, స్పీకర్లు: రూ.20వేల నుంచి రూ.2లక్షలు గణపతి నిమజ్జనం



ఖర్చులు..వాహనం: రూ.2వేల నుంచి రూ.15వేలు బ్యాండ్, సన్నాయి మేళం, కోలాటం: రూ.20వేల నుంచి రూ.2లక్షలు అలంకరణ: రూ.10 వేల నుంచి రూ.లక్ష

# అనుసంధానం.. అనివార్యం

**రాజాపేట, –నవభూమి:** ఉపాధిహామీ ద్వారా చేపట్టే పొలం పనుల ఖర్చును 75 శాతం రైతులు భరించేలా, 25 శాతం ప్రభుత్వం చెల్లించాలని సూచించింది.ఈ క్రమంలోనే సాగు పనులను ఉపాధిహామీని జత చేయాలని గత ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర శాసనసభ కూడా తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. కానీ ఇప్పటివరకు సాగు పనులను ఉపాధిహామీ పనులకు అనుసంధానించక పోవడంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. 2022–23 సంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లు కలిపి 22.24 లక్షల ఎకరాల్లో ఆయా పంటల సాగు చేపట్టారు. మూడు జిల్లాలకు కలుపుకుని 15,95,394 మంది ఉపాధిహామీ కూలీలుండగా, రోజుకు సగటున రెండున్నర లక్షల మంది కూలీలకుపైగా ఉపాధిహామీ పనులకు వెళుతుండగా రూ.130 కోట్లకుపైగా ప్రభుత్వం నిధులను వెచ్చిస్తుండటం గమనార్హం.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో రైతులు సాగుపనులు ముమ్మరం చేశారు. యంత్ర పరికరాలు ఎన్ని మార్కెట్లోకి వస్తున్నా, వ్యవసాయం చేయాలంటే కూలీలపైన ఆధారపడాల్సిందే. ఈ తరుణంలో వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఉంది. వ్యవసాయానికి ఉపాధిహామీని పూర్తిస్థాయిలో అనుసంధానించాలని నీతిఆయోగ్–2016 ఏప్రిల్ లోనే కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎనిమిదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు దానిపై దృష్టి సారించడం లేదు.కూలీలకు పెరిగిన డిమాండ్..ప్రస్తుతం వరినాట్లు, కలుపు తీయడం, పత్తి సాగులో క్రాసింగ్, ఇతరత్రా అవసరాల కోసం జిల్లాలో పెద్ద ఎత్తున కూలీల కొరత ఏర్పడింది. రోజుకు ఒక పనిమనిషికి రూ.500 నుంచి రూ.600 ఇస్తేగానీ రాని పరిస్థితి ఉంది.పత్తి గింజలు నాటడం మొదలుకుని వరినాట్లు, వరికోతలు,కలుపు తీయడం,పత్తి ఏరడం, నూర్పిడి తదితర పనులు ఉపాధిహామీ కూలీలతో చేయించే వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. కూరగాయల పందిళ్లు, షెడ్ల నిర్మాణం,బావుల తవ్వకం, పూడికతీత, ఫీడర్‌ఛానళ్లు,నీటినిల్వ కందకాల తవ్వకం, వర్మికంపోస్టు గుంతల తవ్వకం, ఇంకుడుగుంతలు, పంటకుంటల నిర్మాణాలను కొంతవరకు చేపడుతున్నా కూలీల కొరత తీరే పనులను జాబితాలో చేర్చాల్సి ఉంది.



# ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జాయంతి వేడుకలు

కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న జూలూరి గౌరీ శంకర్



**మునగాల సెప్టెంబర్ 09 నవభూమి ప్రతినిధి** మండల కేంద్రంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో ప్రజాకవి కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, రిటైర్డ్ ఐఏఎస్ ఎం.వి.రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కాళోజీ జీవితం నేటి తరం ఆదర్శం తిసుకోవాలని అన్నారు. తెలంగాణలో భాష, సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన గోప్ప వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, నాయకులు పందిరి నాగిరెడ్డి, కందిబండ సత్యనారాయణ, చిల్లంచర్ల ప్రభాకర్, ఉప్పుల యుగేందర్ రెడ్డి , ఉడుం కృష్ణ , అర్వపల్లి శంకర్, గంధం సైదులు, గ్రంధాలయాధికారి దేవబత్తిని లలిత దేవి, పాఠకులు ఈట పవన్, భాస్కర్ ఉపేందర్, సాయికుమార్ ,మోహన్, రవి, ఆలేటి లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు హర్షణీయం

## సామాజిక ఉద్యమకారులను డాక్టర్ వేమూరి సత్యనారాయణ

**మునగాల సెప్టెంబర్ 09 నవభూమి ప్రతినిధి** తెలంగాణ హైకోర్టు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఇచ్చిన తీర్పు హర్షణీయమని సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమురి అన్నారు. మండల పరిధిలోని నరసింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారులు డాక్టర్ వేమూరి సత్యనారాయణ తన నివాసంలో సోమవారం ఓ ప్రకటన ద్వారా మాట్లాడుతూ గత తొమ్మిది నెలల క్రితం జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో ఒక పార్టీ గుర్తుపై. గెలిచి మరొక పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టుపార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై. నాలుగు వారాలలోగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ కార్యాలయం కు. ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా స్పీకర్. తగు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఈ కేసును హైకోర్టు సుమోటాగా తీసుకుని విచారణ చేపడతామనడం అభినందనీయమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించి బీఫాం ఇచ్చిన పార్టీలను వదిలి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు అని అన్నారు. పార్టీలు మారే ప్రజా ప్రతినిధులకు ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదని చెప్పవచ్చు, అభివృద్ధి పేరుతోఇతర పార్టీలకు వెళ్లడం దుర్మార్గమని ఇలా పార్టీలు ఫిరాయించే ఎమ్మెల్యేలను మిగిలిన ప్రజాప్రతినిధులపై. అనర్హత వేటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కొరారు. ఇలాంటి తీర్పులతో సామాన్యులకు సైత న్యాయస్థానాలపైమరింత నమ్మకం కలుగుతుందని అభివర్ణించారు

# వినూత్న ఆలోచనలతో పోచంపల్లి మహిళల ముందడుగు

**భూదాన్‌పోచంపల్లి, –నవభూమి:** కాలం మారుతున్న కొద్దీ మహిళల ఆలోచనలు మారుతున్నాయి. వంటింటికే పరిమితం కాకుండా వ్యాపారంలో కొత్తపుంతలు తొక్కాలనే ఆలోచన చేసి పోచంపల్లి పట్టుచీరలను అంతర్జాతీయస్థాయిలో విక్రయాలు సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇంట్లో సమయాన్ని వృథా చేయకుండా చీరలను వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల సహాయంతో ఆన్‌లైన్ వ్యాపారం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశవిదేశాల నుంచి చేనేతకు మంచి ఆదరణ లభిస్తోంది. వినియోగదారుల అభిరుచులకు, ఫ్యాషన్‌లకు అనుగుణంగా వస్త్రాలను తయారు చేసి వారి మన్ననలు పొందుతున్నారు. కొంతమంది ప్రత్యేకంగా మోడల్స్‌తో చేనేత వస్త్రాలతో ఫొటోషూట్ చేయిస్తున్నారు.

# మూగజీవాల మృత్యువాత.. అన్నదాతకు తీరని వ్యధ



**భానుపురి–నవభూమి:** కాడెడ్లు లేకపోతే రైతు దిగాలు చెందుతారు..అలాంటి సాగులో ముఖ్య భూమిక వహిస్తున్న పశువులు ఇటీవల కురిసిన వర్షాలకు చనిపోతే ఆ రైతు బాధ వర్ణనాతీతం. పొద్దస్తమానం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత వచ్చే ఆనందం అంతాఇంతా కాదు. ఇందులో భాగస్వాములుగా ఉంటున్న పశువులు వ్యవసాయ భూముల వద్ద విగతజీవులుగా మారడంతో వారి ఆర్థిక భారాన్ని ఎవరూ పూడ్చలేరు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పశువులు మృత్యువాత పడ్డాయి. 40 పశువులు.. 105 కోళ్ల మృతి సూర్యాపేట జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు 40 పశువులు, 105 కోళ్లు మృత్యువాత పడ్డాయి. జిల్లాలో చాలా మంది రైతులు వ్యవసాయ భూముల వద్ద కొట్టాలు ఏర్పాటు చేసుకుంటారు. పొద్దస్తమానం పనులు చేసుకొని సాయంత్రం అక్కడే కట్టేసి వస్తుంటారు. ఒక్కసారి విపత్తు వారిని నిండా ముంచుతోందని ఊహించలేదు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో 11, కోదాడ 3, చిలుకూరు 10, మునగాల 2, మద్దిరాల 2, మఠంపల్లి 4, ఆత్మకూర్(ఎస్) 2, చింతలపాలెం మండలంలో 6 గొర్రెలు వర్షాల కారణంగా మృత్యువాత పడ్డాయి. వీటిలో నాలుగు ఎద్దులు, 15 గేదెలు, నాలుగు ఆవులు, 14 గొర్రెలు, 105 కోళ్లు వరదల కారణంగా చనిపోయాయి. జిల్లాలో పశువుల విలువ సుమారు రూ.12,18,500 ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రతిపాదనలు పంపిస్తాం జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చనిపోయిన పశువులకు పరిహారం వచ్చేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. విడుదలైన వెంటనే రైతులకు అందజేస్తాం.

# దివ్యాంగులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

**చౌటుప్పల్ –నవభూమి:** దివ్యాంగులు ఈ నెలాఖరు వరకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పొందాలని భారత ప్రభుత్వం నిర్దేశించిందని జాతీయ మేధో దివ్యాంగ వ్యక్తుల సాధికారత సంస్థ రాష్ట్ర విభాగం చీఫ్ కోఆర్డినేటర్ జి.శ్రీనివాసులు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. అర్హులైనవారు ఈ పథకాలను వినియోగించుకునేందుకు గుర్తింపు కార్డు తప్పనిసరి. మా సంస్థ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎంపిక చేసిన కొన్ని మండలాల్లో ఈనెల 10న దివ్యాంగుల గుర్తింపు శిబిరాలను నిర్వహిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తాం' అని ఆయన వివరించారు. చౌటుప్పల్‌లో ఆయన ఆదివారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. దివ్యాంగులందరికీ గుర్తింపు కార్డులు జారీ చేశారా? శ్రీనివాసులు: దేశంలోని ప్రతి దివ్యాంగుడిని గుర్తించాలని, వారికి ఒక గుర్తింపు కార్డును ఇవ్వాలని భారత ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఈనెలాఖరు వరకు అందరికీ గుర్తింపు కార్డులు అందించేందుకు తుది గడువుగా నిర్ణయించారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి భారత ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డు(యూడీఐడీ) ఆధారంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవా కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించారు. గుర్తింపు కార్డులు పొందాలంటే ఏం చేయాలి? శ్రీనివాసులు: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. నల్గొండ జిల్లాలోని సంస్థాన్ నారాయణపురం, పుట్టపాక, గట్టుప్పల, చండూరు, కనగల్ కేంద్రాల్లో ఈనెల 10న దివ్యాంగుల గుర్తింపు శిబిరాలను జిల్లా అధికార యంత్రాంగం సహకారంతో మా సంస్థ ద్వారా నిర్వహిస్తున్నాం. ఈ శిబిరాలకు హాజరయ్యే దివ్యాంగులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు, రెండు ఫొటోలు తీసుకొని రావాల్సి ఉంటుంది. శిబిరంలో పాల్గొంటే ఉపయోగమేంటి? శ్రీనివాసులు: శిబిరంలో పాల్గొనే దివ్యాంగులకు గుర్తింపు కార్డు, మానసిక, సెరిబ్రల్ పాలీ, ఆటిజం, మతిస్థిమితం లేనివారికి 'నిరామయ' బీమా కార్డు ఇస్తారు. కృత్రిమ పరికరాలు అవసరమైన వారిని 'అలిమ్‌కో' ప్రతినిధులు గుర్తించి కొలతలు తీసుకుంటారు. పిల్లలకు చదువుకునేందుకు అంధత్వం ఉన్నవారికి బ్రెయిలీ, ఇతరులకు వారి మానసిక స్థాయిని బట్టి పుస్తకాలను ఉచితంగా అందించేందుకు సిఫార్సు చేస్తారు.

# అన్నాచెల్లెలు.. క్రీడా మల్లెలు





**నల్గొండ –నవభూమి:** ఆ.. అన్నాచెల్లి అటు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ..ఇటు క్రీడల్లో ప్రతిభ చాటుతూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. కనగల్ మండలం చెట్లచెన్నారం గ్రామానికి చెందిన అప్పల మణిరామ్, అప్పల సోని ఫుట్‌బాల్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. వీరి తల్లిదండ్రులు లింగయ్య, శోభ. లింగయ్య కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నారు. మణిరామ్, సోని ప్రస్తుతం నల్గొండ పట్టణంలోని నారాయణ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇద్దరూ ఫుట్‌బాల్‌లో 8వ తరగతి నుంచే శిక్షణ పొందారు. నిరంతర సాధనతో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ఆటతీరుతో ఇప్పటి వరకు ఎన్నో బహుమతులు గెలుపొందారు. మణిరామ్ ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో రెండుసార్లు, రెండుసార్లు రాష్ట్రస్థాయిలో ఆడాడు. తాజాగా హైదరాబాద్ జింఖానా మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఆడిన ప్రతి మ్యాచ్‌లో మిడాన్ ప్లేయర్‌గా రాణిస్తూ జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. చదువులో, క్రీడల్లో రాణిస్తున్నందుకు ఆనందంగా ఉందని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన ధ్యేయమని ఈ విద్యార్థి పేర్కొంటున్నాడు. సోని ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో రెండుసార్లు, రాష్ట్రస్థాయిలో రెండుసార్లు, జాతీయస్థాయిలో ఒకసారి ఆడి బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందుకుంది. ఇటీవల సిద్దిపేటలో జరిగిన ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టు ఎంపికలో పాల్గొని ప్రతిభ చాటింది. గోల్ కిపర్‌గా ప్రతిభను చాటి జట్టు విజయాల్లో ప్రధాన భూమిక పోషించింది. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటేందుకు నిరంతరం నల్గొండ మేకల అభినవ్ మైదానంలో సోదరుడితో కలిసి సాధన చేస్తున్నానని, క్రీడల కోటాలో ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని పేర్కొంది.

# మాటల్లో యాస.. భాషకు శ్వాస..!

**మోత్కూరు –నవభూమి:** తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో మాట్లాడే తెలుగు మాండలికం వైవిధ్యంగా ఉంటుంది. ఆ ప్రాంత జీవనచిత్రం, భాషా మకరందం అందులో ప్రస్ఫుటం అవుతుంది. యాసలో పలికే పలుకులు, రాసే భాష ప్రత్యేక శైలిలో ఉంటుంది. సురవరం, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, వరదాచార్యులు ఇలా.. అనేకమంది ఈ భాషా పరిరక్షణకు కృషి చేశారు. అయితే కాలక్రమంలో యాస, భాషకు తీరని అన్యాయమే జరిగింది. అలాంటి క్రమంలో జరిగిన ఉద్యమాల్లో ఈ భాష పాటలు, రచనల రూపంలో పరవళ్లు తొక్కింది. జనబాహుళ్యంలోకి విస్తృతంగా చొచ్చుకెళ్లింది. దీంతో మళ్లీ పునర్జీవం కలిగింది. ఇక ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించాక 2017లో తెలంగాణలో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి, భాష, యాసలకు మళ్లీ పట్టం కట్టాలని ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఏటా తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. పల్లెపట్టున.. పదసేకరణ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ భాషా నిఘంటువు నిర్మాణానికి యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టింది. ఇందుకు 'పదాల' సేకరణ సాగుతుంది. పరిశోధకులు, భాషావేత్తలు మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజల భాషలోని అరుదైన, కమ్మనైన పదాలను సేకరిస్తున్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి ద్వారా సాహితీ పరిరక్షణకు నడుం బిగించారు. 'కావ్యపరిమళం' పేరిట తెలుగు సాహిత్యం, భాషా విశేషాలపై దృష్టిని కేంద్రీకరించారు. అంతర్జాలం వేదికగా అడుగులు..అరచేతిలో అంతర్జాలం పఠనం వైపు అడుగులు వేయిస్తుంది. యువతలో దాగిన సృజనాత్మకత సాహితీ అభిలాషను వెలికి తీస్తుంది. లఘుచిత్రాలు, పాటలు, సినిమాలు, సీరియల్స్, ఈ–పుస్తకాలు, బ్లాగులు యువ రచయితలకు వేదికలుగా మారుతున్నాయి.

# ఉన్నత విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:-** విద్యార్థినిల భవిష్యత్తు కార్యకలాపాల గురించి, విద్యా ప్రాముఖ్యత గురించి వివరిస్తూ ఉన్నత విద్యను అభ్యసించడం వల్ల సమాజంలో గొప్ప పౌరులుగా, ఉన్నత శిఖరాలకు అధిరోధించొచ్చని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ హితబోధ చేశారు. సోమవారం మినా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఆగమన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్ళాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సాంకేతిక రంగంలో మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. డిసిసి అధ్యక్షులు కె.శంకర్ నాయక్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థినులకు అందుబాటులో ఇంజనీరింగ్ వ్యవస్థ ఉండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వ్యక్తిగత నిపుణులు సుమన్ బోక్రే మాట్లాడుతూ విద్యార్థినిలు మానసిక ఒత్తిడి లకు లోను కాకుండా, మనోధైర్యాన్ని ఎలా వృద్ధి చేసుకోవాలో మేలుకోవాలో తెలిపారు. మిట్స్ చైర్మన్ మహమూద్ అలీ నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిఫారు రు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శైహ్లాబతుల్, ఏజాజ్, వైస్ ప్రిన్సిపల్ వాణీ, మగ్దూం, చావుస్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థినిలు పాల్గొన్నారు

# ఎన్వైపి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మహా అన్నదానం

### భక్తులకు వడ్డిస్తున్న అధ్యక్షుడు గునిగంటి రమేష్ గౌడ్ ,అన్నదాతలు చేరుకు నవీన్ గౌడ్, బద్దం జితేందర్ రెడ్డి



**భూదాన్‌పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 09** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో సోమవారం ఎన్వైపి యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ పంచమరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు సందర్భంగా భక్తులకు మహా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాతలు చేరుకు నవీన్ గౌడ్, బద్దం జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు . సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు గునిగంటి రమేష్, అన్నదాతలు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డబ్బికారి సాహెష్. వేముల పాండు ,కుడికాల రామ్ నరసింహ, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీనివాస్ సహాయ కార్యదర్శులు కొంగర పాండు చెరుకు ఆనంద్ ముప్పిడి శ్రీనివాస్ గునిగంటి వెంకటేష్, సంస్కృతిక కార్యదర్శి కీర్తి సంజీవ, సభ్యుల మస్తాన్ ప్రసాద్, తన్నీరు శ్రీధర్, కొండ భాస్కర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలను తొలగించండి

**భువనగిరి -నవభూమి:** చౌటుప్పల్‌లోని పలు పరిశ్రమల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. నీరు కలుషితమై అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పరిశ్రమల నుంచి వెలవడుతున్న వ్యర్థాలు, రసాయనాలతో భూగర్భ జలాలు కలుషితమై పంటలు, పాడి పరిశ్రమలు దెబ్బతింటున్నాయని వాపోయారు. కాలుష్య పరిశ్రమలను మూసివేసి తమకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# క్రిష్ణానదీ తీర ప్రాంతాల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### అధికారులు అందుబాటులో ఉండాలి

### సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశాలు



**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:-** వర్ష సూచనలున్నందున, నాగార్జునసాగర్ డ్యాం నుంచి భారీగా నీటివిడుదల జరిగే అవకాశం ఉన్నందున క్రిష్ణా నదీ తీర ప్రాంతాల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా ఆయా మండలాల అధికారులు అందుబాటులో ఆదేశాలు జారీ చేసినట్టు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటీ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే 58 శాతం పూర్తి అయ్యిందన్నారు. రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం వల్ల సుమారు 2 ఇళ్లు, 3ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయని, 51 గుడిసెలు పడిపోయాయని, ఒక ఆవు చనిపోయిందని ఆయన తెలిపారు. వాటికి పరిహారం ఇచ్చేందుకు పంచనామా నిర్వహించారన్నారు. ప్రభుత్వానికి నష్టం అంచనా నివేదిస్తున్నామన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి డివిజన్ లోని వాడపల్లి కృష్ణా నది, నాగార్జునసాగర్ సమీపంలోని దయ్యాలగండి వద్ద ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. వర్ష సూచనలు, అదేవిధంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి భారీగా కృష్ణా నదిలో విడుదల చేస్తున్నందున క్రిష్ణా నదీ తీర ప్రాంతాల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

# ప్రైవేట్ ఆసుపత్రుల, డయాగ్నొస్టిక్ కేంద్రాల దోపిడీ అరికట్టాలి

### సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు సీపీఐ వినతి

**మిర్యాలగూడ -నవభూమి:** మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్ లలో టెస్టుల పేరిట అక్రమ వసూళ్లను అరికట్టాలంటు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటికి సిపిఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వర్షాలు ప్రారంభమైన నాటి నుండి విషజ్వరాలు, చికెన్ గున్యా, మలేరియా, డెంగ్యూ రక్త పరీక్షలకు రాయడం విపరీతంగా టెస్టులకు తీసుకోవడం జరుగుతుందని ఆరోపించారు. డెంగ్యూ వస్తే రూ.30000 రూపాయలు ఖర్చు చేయిస్తున్నారనీ పేర్కొన్నారు. వారి అక్రమాలను అరికట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండలాల కార్యదర్శులు ఎండీ. సయీద్, డి. లింగానయక్, జిల్లా యాదగిరి, ఏ. రామలింగం, వలంపట్ల వెంకన్న, డి.దుర్గమ్మ,మార్థమ్మ, సైదమ్మ, ఎస్కే.సమీమ్, రహిమ, సోని, వెంకటమ్మలు పాల్గొన్నారు.



# బొత్తలపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఆగి ఉన్న బొలెరో కారును ఢీకొట్టి డీసీఎం వాహనం బోల్తా

### ఇద్దరు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు





**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 9:-**దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామం వద్ద సోమవారం నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని వేగంగా వచ్చిన డి డీసీఎం వాహనం ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో బొలెరో వాహనంలో ఉన్న ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మృతులు దేవరకొండ ప్రాంతానికి చెందిన యువకులు యాది(22), రిజ్వాన్ (36)లుగా గుర్తించారు. టాటా నెట్ వర్క్ కు చెందిన నలుగురు కార్మికులు రోడ్డు పక్కన కేబుల్ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న వాడపల్లి పోలీసులు మృతదేహాలు, క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ని ఘనంగా సన్మానించిన రైస్ మిల్లర్స్



**మిర్యాలగూడ -నవభూమి:** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ అమిత్ మాలెంపాటిని సోమవారం మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.వెంకటరమణ చౌదరి బాబి, కోశాధికారి చిల్లంచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్ ఆసియా ఖండంలోనే రైస్ ఇండస్ట్రీస్ మిర్యాలగూడ పేరుగాంచిందన్నారు. ఏటా 5 లక్షల టన్నుల ధాన్యం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు, ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ నుండి విదేశాలకు బియ్యం ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. పట్టణ పరిసర ప్రాంతాలలో రైస్ మిల్లుల ధాన్యం సేకరణ, లేవీ, కష్టమ్ మిల్లింగ్, మిల్లులకు సంబంధించిన వివరాలను సబ్ కలెక్టర్ అమిత్ కు తెలియజేశారు.